తెలంగాణ
# వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871

విలేకరులు కావలెను
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం
మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం
7386173123 నంబర్‌ను సంప్రదించండి..
డి. యోగేష్ కుమార్, సీఈవో

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక :356 గురువారం 02-07- 2026 పేజీలు: 4 వెల రూ. 03

# ఆదాయ పెంపుపై సీఎం రేవంత్ ఫోకస్

## లీకేజీలకు చెక్.. 'చేజింగ్ సెల్' ఏర్పాటు చేయాలని ఆదేశం



హైదరాబాద్, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు)
రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా ఆదాయ లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, లీకేజీలను పూర్తిగా అరికట్టి ఆదాయ వనరులను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఆదాయ సమీకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా 'చేజింగ్ సెల్' ఏర్పాటు చేయాలని ఆదేశించారు.
హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ సంస్థలో రాష్ట్ర ఆదాయ సమీకరణపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ఈ ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.
సమావేశంలో శాఖల వారీగా ఆదాయ వనరులు, ప్రస్తుత వసూళ్లు, పెండింగ్ అంశాలపై సమీక్షించిన సీఎం.. ముఖ్యంగా హెచ్ఎండీఏ, టీజీఐఐసీ సంస్థలు ఆదాయాన్ని పెంచేందుకు 2

# కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారు..

## వైఫల్యాలను ఎండగడుతున్నాం: కేటీఆర్



హైదరాబాద్, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు)
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను పరిష్కరించకుండా అబద్ధపు ప్రచారాలతో కాలం గడుపుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అంశాన్ని ప్రచారానికే పరిమితం చేస్తోందని, క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదన్నారు.
హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దిందన్నారు. వ్యవసాయం, సాగునీరు, విద్యుత్, పారిశ్రామిక అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2

# 'ఒరిజినల్ కాంగ్రెస్ నేతలకు గుర్తింపు లేదు'

## సీఎం రేవంత్‌పై రాజగోపాల్ రెడ్డి అసంతృప్తి



నల్లగొండ, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు)
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహారశైలిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, పార్టీలో ఎన్నో ఏళ్లుగా పనిచేసిన ఒరిజినల్ కాంగ్రెస్ నాయకులు క్రమంగా కనుమరుగవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ కీలక నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకుంటున్నారని విమర్శించారు. 2

# బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ఎల్లుండి తీర్పు

## బాధితురాలికి హైకోర్టు నోటీసులు




2

# అయోధ్య రామాలయ విరాళాల కేసులో షాకింగ్ ట్విస్ట్

## మరుగుదొడ్లలో దాచి నగదు తరలించినట్లు నిందితుడి ఒప్పుకోలు




2

# యువతకు కవిత విజయ మంత్రం

## నిజాయితీ, కష్టపడితేనే ఉద్యోగం వస్తుంది



హైదరాబాద్, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు)
మెహదీపట్నంలోని కింగ్స్ ప్యాలెస్‌లో నిర్వహించిన భారీ జాబ్ మేళాలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పాల్గొని యువతకు ఉద్యోగాలపై పలు సూచనలు చేశారు.
దాదాపు 150 కంపెనీలు పాల్గొన్న ఈ జాబ్ మేళా ద్వారా 2

## కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర భారీగా తగ్గింపు

19 కేజీల సిలిండర్‌పై రూ.183 కోత..
నేటి నుంచే కొత్త ధరలు అమలు



2

## వెనుజులాను వణికిస్తున్న భూకంపాల విధ్వంసం

2 వేల దిశగా మృతుల సంఖ్య..
10,571 మందికి గాయాలు..
50 వేల మంది గల్లంతు 2

# హైదరాబాద్ ట్రాఫిక్‌కు ఏఐ టెక్నాలజీ..

## సీఎం రేవంత్ కీలక ఆదేశాలు



2

# ఆదాయ పెంపుపై సీఎం రేవంత్ ఫోకస్

ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, గనుల శాఖలతో పాటు ఇతర ఆదాయ శాఖల్లో ఎలాంటి లీకేజీలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర ఆదాయాన్ని పెంచే విషయంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేసిన సీఎం, ప్రతి శాఖ తన పనితీరును మరింత మెరుగుపరుచుకుని లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. శాఖల వారీగా సామర్థ్యాన్ని పెంచి, ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అన్ని అవకాశాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

అభివృద్ధి ప్రాజెక్టులు, మౌలిక వసతుల పనులు వేగంగా పూర్తి కావాలంటే శాఖల వారీగా సమగ్ర బడ్జెట్ ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా పెండింగ్ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను మొదటి ప్రాధాన్యంగా తీసుకుని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్ పూర్తిగా వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉండాలని, ఊహాజనిత అంచనాలకు తావు లేకుండా రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు అవసరమైన నిధుల సమీకరణలో అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని, ప్రభుత్వ తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడం ద్వారా అభివృద్ధి పనులు మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారు..

రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని విమర్శించారు.

రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని కేటీఆర్ అన్నారు. రైతులకు యూరియా, ఇతర ఎరువులు సకాలంలో అందడం లేదని, విత్తనాల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ వంటి హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి సభలు, ప్రచార కార్యక్రమాలతో కాలం గడుపుతోందని విమర్శించారు.

రాష్ట్రంలో విద్యుత్ సరఫరా, తాగునీటి సమస్యలు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాల్లో ప్రభుత్వం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. పారిశ్రామిక రంగంలో కొత్త పెట్టుబడులు తగ్గిపోయాయని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో తీవ్ర నిరాశ నెలకొందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం తగ్గుతోందన్నారు.

ఇటీవల ప్రభుత్వం వ్యవసాయ రంగంపై భారీగా ఖర్చు చేశామని ప్రకటించడం పూర్తిగా వాస్తవాలకు విరుద్ధమని కేటీఆర్ అన్నారు. ఒక మంత్రి ఒక లెక్క చెబితే, ముఖ్యమంత్రి మరో లెక్క చెబుతున్నారని, ప్రభుత్వానికే తమ ఖర్చులపై స్పష్టత లేదని ఎద్దేవా చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కల్పిత గణాంకాలు చెబుతున్నారని ఆరోపించారు.

ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనబెట్టి ప్రతిపక్షాలపై విమర్శలు చేయడానికే ఎక్కువ సమయం కేటాయిస్తోందని కేటీఆర్ అన్నారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మరింత దిగజార్చిందని విమర్శించారు.

ప్రజల తరఫున ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడం తమ బాధ్యత అని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం అసెంబ్లీ నుంచి ప్రజాక్షేత్రం వరకు ప్రతి వేదికపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, ప్రజల సమస్యలపై రాజీపడే ప్రసక్తే లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

## 'ఒరిజినల్ కాంగ్రెస్ నేతలకు గుర్తింపు లేదు'

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు నియామకంలో స్థానిక ప్రజాప్రతినిధిగా ఉన్న తనకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదని రాజగోపాల్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన సీనియర్ నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ఇలాంటి ప్రతిష్టాత్మక అంశాల్లో స్థానిక నేతలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఇదే కారణంతో ఇటీవల నల్లగొండలో జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభకు తాను హాజరుకాలేదని స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులను పక్కనబెట్టి ఏకపక్షంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో కాంగ్రెస్‌కు నష్టమని హెచ్చరించారు. కేడర్ మనోభావాలను దెబ్బతీసే నిర్ణయాలు పార్టీకి మేలు చేయవని సూచించారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కోమటిరెడ్డి సోదరులకు బలమైన రాజకీయ పట్టు ఉన్న నేపథ్యంలో రాజగోపాల్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యమంత్రి నిర్ణయాలపై సొంత పార్టీ ఎమ్మెల్యే బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం, సీఎం వర్గం ఎలా స్పందిస్తుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ఎల్లుండి తీర్పు

హైదరాబాద్, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు)
కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బండి భగీరథ్ దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. కేసు పూర్వాపరాలు, దర్యాప్తు పురోగతిని పరిశీలించిన న్యాయస్థానం బాధిత బాలికకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది.

బాధితురాలి తరఫు వాదనలు వినడం అవసరమని భావించిన హైకోర్టు, తదుపరి విచారణను ఎల్లుండికి వాయిదా వేసింది. బండి భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేయాలా వద్దా అనే అంశంపై అదే రోజు తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన నేపథ్యంలో హైకోర్టు విచారణపై రాజకీయ, న్యాయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. దర్యాప్తు సంస్థలు సమర్పించిన ఆధారాలు, చార్జ్‌షీట్ వివరాలను కూడా కోర్టు పరిగణనలోకి తీసుకోనుంది.

బాధితురాలి స్పందన, ఇరు వర్గాల వాదనల అనంతరం హైకోర్టు తుది నిర్ణయం తీసుకోనుంది. బెయిల్ మంజూరు అవుతుందా లేదా అన్న అంశంపై ఎల్లుండి జరిగే విచారణ కీలకంగా మారింది.




# అయోధ్య రామాలయ విరాళాల కేసులో షాకింగ్ ట్విస్ట్

అయోధ్య, జులై 01(తెలంగాణ వెన్నెల వాక్కు)
అయోధ్య శ్రీరామ జన్మభూమి ఆలయంలో భక్తులు సమర్పించిన విరాళాల సొమ్ము అక్రమంగా పక్కదారి పట్టిన కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. విరాళాల లెక్కింపులో అక్రమాలకు పాల్పడిన నిందితులు అపహరించిన నగదును ఆలయ ప్రాంగణంలోని మరుగుదొడ్లలో దాచి, అనంతరం భద్రతా సిబ్బంది కళ్లుగప్పి దశలవారీగా బయటకు తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

ఈ కేసులో ప్రధాన నిందితుడు అవినాశ్ శుక్లాను అధికారులు సుదీర్ఘంగా విచారించగా, విరాళాల లెక్కింపు ప్రక్రియలో ఉన్న లోపాలను ఆసరాగా చేసుకుని నగదును కాజేసినట్లు అంగీకరించినట్లు సమాచారం. ముందుగా నగదును మరుగుదొడ్లలో దాచిపెట్టి, అనుమానం రాకుండా తర్వాత బయటకు తీసుకెళ్లినట్లు విచారణలో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు.

ఈ అక్రమంలో మరికొందరు ఆలయ సిబ్బంది, బయటి వ్యక్తుల పాత్ర కూడా ఉండొచ్చనే అనుమానంతో దర్యాప్తు సంస్థలు విచారణను ముమ్మరం చేశాయి. నిందితుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా మరికొందరిని గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

ఘటన నేపథ్యంలో ఆలయంలో విరాళాల లెక్కింపు విధానం, భద్రతా వ్యవస్థపై అధికారులు సమీక్ష చేపట్టారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సీసీటీవీ నిఘా, డిజిటల్ లెక్కింపు విధానాలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. దేవుడి హుండీ సొమ్మును దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు, సాధువులు డిమాండ్ చేస్తున్నారు.

# హైదరాబాద్ ట్రాఫిక్‌కు ఏఐ టెక్నాలజీ..

హైదరాబాద్:
హైదరాబాద్ మహానగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపేందుకు అత్యాధునిక కృత్రిమ మేధస్సు (ఆ×) ఆధారిత ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ట్రాఫిక్ పరిస్థితులకు అనుగుణంగా సిగ్నళ్లు స్వయంచాలకంగా పనిచేసే విధంగా సాంకేతిక వ్యవస్థను అమలు చేయాలని తెలిపారు.

ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో అనలాగ్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్స్ కిప్‌మాన్, మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) ఎండీ పి. కృష్ణారెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని కలిసి ఫిజికల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది.

ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని అన్ని ట్రాఫిక్ సిగ్నళ్లను ఒకే వ్యవస్థతో అనుసంధానం చేసి, వాహనాల రద్దీ, వాతావరణ పరిస్థితులు, రోడ్ల పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సిగ్నళ్ల వ్యవధిని స్వయంచాలకంగా నియంత్రించేలా వ్యవస్థను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలకు గ్రీన్ కారిడార్ సృష్టించేలా సాంకేతికతను వినియోగించాలని పేర్కొన్నారు.

అనలాగ్ ప్రతినిధులు ఫిజికల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ ప్రత్యేకతలను వివరించారు. సెన్సర్లు, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో నగరంలో ట్రాఫిక్ రద్దీని ముందుగానే గుర్తించడం, నీటి లీకేజీలు, విద్యుత్ సమస్యలు వంటి అంశాలను తక్షణమే గుర్తించి పరిష్కరించడం, విద్యుత్ వినియోగాన్ని అవసరానికి అనుగుణంగా నియంత్రించడం వంటి స్మార్ట్ సిటీ సేవలను ఈ వ్యవస్థ అందించగలదని తెలిపారు. ఇది ముందుగా ఇచ్చిన ప్రోగ్రామింగ్‌కే పరిమితం కాకుండా నిరంతర అభ్యాసం ద్వారా తన పనితీరును మెరుగుపరుచుకునే నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీ అని వివరించారు.

హైదరాబాద్‌లో పైలట్ ప్రాజెక్టుగా ఈ విధానాన్ని అమలు చేసే అవకాశాలపై సమావేశంలో చర్చించారు. భవిష్యత్తులో కాగ్నిటివ్ సిటీస్ అభివృద్ధికి ఈ వ్యవస్థ కీలకంగా మారుతుందని ప్రతినిధులు తెలిపారు.

ఈ సందర్భంగా ఫిజికల్ ఇంటెలిజెన్స్ అమలుకు సంబంధించి అనలాగ్ సంస్థ, ఎంఈఐఎల్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై ముఖ్యమంత్రి సమక్షంలో పరస్పరం పత్రాలు మార్చుకున్నారు. తెలంగాణను అత్యాధునిక సాంకేతికత వినియోగంలో దేశానికి ఆదర్శంగా నిలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జూలై 5 నుండి నూతన బాలాలయంలో అమ్మవారి దర్శనం

బాసర, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని నూతనంగా నిర్మించిన బాలాలయంలో జూలై 5వ తేదీ నుండి భక్తుల దర్శనార్థం ప్రవేశపెట్టనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆలయానికి దేశవ్యాప్తంగా భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది.



బుధవారం ప్రత్యేక అక్షర మండపంలో చిన్నారులతో వచ్చిన తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో అక్షరాభ్యాస పూజలు నిర్వహించారు. మరో నాలుగు రోజుల్లో బాలాలయం ప్రారంభం కానుండటంతో అమ్మవారి దర్శనం, అక్షరాభ్యాసం కొరకు తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకల నుండి భక్తులు భారీగా తరలివస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు.

# బాబ్లీ ప్రాజెక్టు 14 గేట్లు ఎత్తివేత.. గోదావరిలోకి నీటి విడుదల

బాసర, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు):
శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరివాహక ప్రాంతమైన మహారాష్ట్ర ధర్మాబాద్ తాలూకాలోని బాబ్లీ ప్రాజెక్టుకు సంబంధించిన మొత్తం 14 గేట్లను బుధవారం అధికారులు ఎత్తివేసి ప్రాజెక్టు నీటిని గోదావరి నదిలోకి విడుదల చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం, ప్రతి ఏటా జూలై 1వ తేదీ నుండి అక్టోబర్ 28వ తేదీ వరకు నాలుగు నెలల పాటు బాబ్లీ ప్రాజెక్టు నీటిని దిగువన ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కొరకు విడుదల చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే బుధవారం మూడు రాష్ట్రాల ఉన్నతాధికారులు, వాటర్ కమిషన్ ప్రతినిధుల సమక్షంలో గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలారు.




# యువతకు కవిత విజయ మంత్రం

2 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఉద్యోగ ఇంటర్వ్యూల్లో అబద్ధాలు చెప్పొద్దని, తెలిసిన విషయాలనే నిజాయితీగా చెప్పాలని యువతకు సూచించారు. తెలియని అంశాలపై "తెలియదు.. అవకాశం ఇస్తే నేర్చుకుంటాను" అని చెప్పేందుకు వెనుకాడొద్దన్నారు. విజయం సాధించడానికి షార్ట్‌కట్‌లు ఉండవని, కష్టపడి పనిచేసిన వారే జీవితంలో ముందుకు వెళ్తారని పేర్కొన్నారు.

తాను 2001లో అమెరికాలో ఉద్యోగం కోసం వెళ్లినప్పుడు ఇంటర్వ్యూలో తెలియని ప్రశ్నలకు నిజాయితీగా సమాధానం చెప్పానని, 20 రోజుల సమయం ఇవ్వాలని కోరగా అవకాశం ఇచ్చారని, ఆ సమయంలో నేర్చుకుని ఉద్యోగం సాధించానని తన అనుభవాన్ని యువతతో పంచుకున్నారు.

ఇంజినీరింగ్, డిగ్రీ, డిప్లొమాతో పాటు పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి కూడా ఈ జాబ్ మేళాలో వారి అర్హతలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం యూట్యూబ్ వంటి వేదికల ద్వారా కొత్త నైపుణ్యాలను ఉచితంగా నేర్చుకునే అవకాశం ఉందని, యువత ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళలు విద్యలో ముందంజలో ఉన్నారని, ప్రస్తుతం ఫార్మల్ కాలేజీల్లో సుమారు 70 శాతం మంది విద్యార్థులు అమ్మాయిలేనని, వారికి కూడా ఉద్యోగ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని కవిత పేర్కొన్నారు. మొదటి ఉద్యోగమే కెరీర్‌కు పునాది అవుతుందని, ఆత్మవిశ్వాసం కోల్పోకుండా నిరంతరం ప్రయత్నిస్తే విజయం తప్పకుండా సాధిస్తారని యువతకు ధైర్యం చెప్పారు.

## కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర భారీగా తగ్గింపు

న్యూఢిల్లీ, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు)
వాణిజ్య అవసరాలకు ఉపయోగించే 19 కేజీల కమర్షియల్ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరను చమురు మార్కెటింగ్ సంస్థలు రూ.183 మేర తగ్గించాయి. సవరించిన ధరలు నేటి (జూలై 1) నుంచే దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి.

తాజా ధరల ప్రకారం ఢిల్లీలో 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.2,930గా నిర్ణయించారు. కోల్‌కతా, ముంబై, చెన్నైతో పాటు ఇతర ప్రధాన నగరాల్లోనూ ధరలు తగ్గాయి. ఈ నిర్ణయంతో హోటళ్లు, రెస్టారెంట్లు, టీ దుకాణాలు, బేకరీలు, చిన్న వ్యాపార సంస్థలకు కొంత మేర ఉపశమనం లభించనుంది.

ప్రతి నెల మొదటి తేదీన అంతర్జాతీయ ముడిచమురు ధరలు, ఎల్పీజీ దిగుమతి వ్యయాలను పరిగణనలోకి తీసుకుని చమురు సంస్థలు ధరలను సమీక్షిస్తుంటాయి. అందులో భాగంగానే ఈసారి కమర్షియల్ సిలిండర్ ధరను తగ్గించినట్లు తెలుస్తోంది.

అయితే 14.2 కేజీల గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు చేయలేదు. గృహ సిలిండర్ ధరలు యథాతథంగా కొనసాగనున్నాయి. ఈ ధర తగ్గింపుతో వాణిజ్య రంగానికి కొంత ఊరట లభిస్తుందని వ్యాపార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# వెనుజులాను వణికిస్తున్న భూకంపాల విధ్వంసం

కారకాస్:
వెనుజులాలో సంభవించిన వరుస భారీ భూకంపాలు దేశాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టాయి. భూకంపాల కారణంగా మృతుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూ దాదాపు 2 వేల మందికి చేరువైనట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు 10,571 మంది గాయపడగా, సుమారు 50 వేల మంది గల్లంతైనట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. శిథిలాల కింద ఇంకా వేలాది మంది చిక్కుకుని ఉండే అవకాశం ఉందని భావిస్తుండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూకంపాల తీవ్రతతో దేశంలోని పలు నగరాలు, గ్రామాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మొత్తం 58 వేలకుపైగా భవనాలు దెబ్బతినగా, వాటిలో 189 భవనాలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. అనేక ప్రాంతాల్లో రహదారులు తెగిపోవడంతో పాటు విద్యుత్, తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. టెలికమ్యూనికేషన్ వ్యవస్థ కూడా దెబ్బతినడంతో పలు ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి.

భూకంపం సంభవించి వారం రోజులు గడిచినా సహాయక చర్యలు ఇంకా యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి. సైన్యం, జాతీయ విపత్తు నిర్వహణ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది, అంతర్జాతీయ రెస్క్యూ బృందాలు శిథిలాల తొలగింపు పనుల్లో నిమగ్నమయ్యాయి. ఆధునిక పరికరాలు, డ్రోన్లు, శునకాల సహాయంతో గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. కొన్నిచోట్ల శిథిలాల కింద నుంచి ప్రాణాలతో బయటపడిన వారిని రక్షించడం ఆశలు రేకెత్తిస్తున్నప్పటికీ, మరికొన్ని ప్రాంతాల్లో మృతదేహాలు వెలికితీయడం కొనసాగుతోంది.

భూకంప బాధితుల కోసం ప్రభుత్వం తాత్కాలిక సహాయ శిబిరాలను ఏర్పాటు చేసింది. వేలాది మందికి ఆహారం, తాగునీరు, మందులు, అత్యవసర వైద్య సేవలు అందజేస్తున్నారు. ఇళ్లు కోల్పోయిన కుటుంబాలు బహిరంగ ప్రదేశాల్లోనే తలదాచుకుంటుండగా, వరుస ప్రకంపనల భయంతో ప్రజలు ఇంకా ఇళ్లలోకి వెళ్లేందుకు వెనుకాడుతున్నారు.

వెనుజులా ప్రభుత్వం అంతర్జాతీయ సమాజాన్ని అత్యవసర సహాయం అందించాలని కోరింది. పలు దేశాలు ఇప్పటికే రెస్క్యూ బృందాలు, వైద్య సిబ్బంది, ఆహార పదార్థాలు, మందులను పంపిస్తున్నాయి. సహాయక చర్యలు పూర్తయ్యే వరకు మృతులు, గల్లంతైన వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఈ విపత్తు వెనుజులా చరిత్రలోనే అత్యంత విషాదకరమైన ప్రకృతి విపత్తులలో ఒకటిగా నిలిచే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

# హస్తం గూట్లో అంతర్గత ముఠా రాజకీయం..!

## మంత్రి జూపల్లి ముందే బద్దలైన అసమ్మతి అగ్నిపర్వతం!



తెలంగాణలో పదేళ్ల భారత రాష్ట్ర సమితి నిరంకుశ పాలనను బద్దలు కొట్టి, ఎంతో కష్టపడి సాధించుకున్న రాజ్యాధికారాన్ని కాంగ్రెస్ పెద్దలు అప్పుడే తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం, పరాయి పార్టీల ప్రయోజనాల కోసం తాకట్టు పెడుతున్నారా? ప్రజాపాలన అంటూ గద్దెనెక్కిన హస్తం పార్టీలో.. అధికారం చేపట్టి కనీసం రెండేళ్లు కూడా నిండకముందే అసమ్మతి కుంపట్లు దావానలంలా మండుతుండటం దేనికి సంకేతం? నిన్నమొన్నటి వరకు నల్గొండ జిల్లాలో శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 'నన్ను సంప్రదించకుండా యాదగిరిగుట్ట ఆలయ కమిటీని ఎలా నియమిస్తారు?' అంటూ ఏకంగా ముఖ్యమంత్రి వైఖరిపైనే తిరుగుబాటు బావుటా ఎగరవేశారు. మరోవైపు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో షబ్బీర్ అలీ, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ లాంటి అగ్రనేతలే స్థానిక అసంతృప్తుల సెగలతో ఊపిరాడక సతమతమవుతున్నారు. కానీ, వీటన్నింటినీ మించి ఉమ్మడి ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల వేదికగా జరిగిన పార్టీ అంతర్గత సమావేశాల్లో బట్టబయలైన నిజాలు చూస్తుంటే, నమ్ముకున్న కార్యకర్తలను నట్టేట ముంచుతూ క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పెద్దలు విపక్షమైన భారతీయ జనతా పార్టీతో లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారనే చేదు నిజం ఇప్పుడు నిలువెల్లా బజారున పడింది. ఉమ్మడి జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలోనే కాంగ్రెస్ సీనియర్ నాయకత్వం, స్థానిక కార్యకర్తలు ఒక్కసారిగా అగ్నిపర్వతంలా బద్దలయ్యారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రాణాలకు తెగించి, నాటి పాలకుల దౌర్జన్యాలకు ఎదురొడ్డి, పోలీసుల లాఠీ దెబ్బలు తిని, అక్రమ కేసులు మోసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చిన కార్యకర్తలను నేడు సొంత ప్రభుత్వంలోనే అత్యంత అవమానకరంగా చూస్తున్నారనే ఆక్రోశం ఆ సమావేశంలో వెల్లువెత్తింది. ఖానాపూర్ కాంగ్రెస్ శాసనసభ్యుడు వెడ్మ బోజ్జుతో పాటు నిర్మల్ జిల్లా సీనియర్ నేతలు, మాజీ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, మాజీ శాసనసభ్యుడు నారాయణరావు పటేల్, మాజీ జిల్లా పరిషత్ ప్రాంతీయ నియోజకవర్గ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి వంటి హేమాహేమీలంతా ఏకతాటిపైకి వచ్చి మంత్రి జూపల్లి కృష్ణారావు వైఖరిపై నిప్పులు చెరిగారు. "రాష్ట్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీయా.. లేక భారతీయ జనతా పార్టీనా? అసలు క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో ఇప్పుడే ఇక్కడే తేల్చుకుందాం" అంటూ కార్యకర్తలు మంత్రిని నిలదీసిన తీరు హస్తం పార్టీ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీసింది.

ఈ సమావేశంలో రేగిన అసలు వివాదం చూస్తే కాంగ్రెస్ అధిష్టానం ఎంతటి దిగజారుడు విధానాలను అవలంబిస్తోందో స్పష్టమవుతుంది. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ నేతలను, రక్తం ధారబోసిన కార్యకర్తలను పూర్తిగా తొక్కిపెడుతూ.. స్థానిక భారతీయ జనతా పార్టీ శాసనసభ్యుడు చెప్పిన పనులను మంత్రులు, ఉన్నతాధికారులు చకచకా ఎలా పూర్తి చేస్తున్నారంటూ సీనియర్లు ఘాటుగా ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారులు సైతం కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను కనీసం గౌరవించకుండా, కమలం నేతల కనుసన్నల్లో నడుస్తున్నారంటే.. అసలు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందా లేక భారతీయ జనతా పార్టీ వెనుక నుండి నడిపిస్తోందా అనే అనుమానం ప్రతి ఒక్కరిలోనూ కలగక మానదు. సిద్ధాంత పరంగా బద్ధశత్రువైన పార్టీకి కాంగ్రెస్ పెద్దలే లొంగిపోయి సహకరిస్తున్నారనే ఆరోపణలు కాంగ్రెస్ శ్రేణులను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టేస్తున్నాయి. పార్టీని నమ్ముకున్న వాడికి ముసలం.. పక్క పార్టీ వాడికి పీఠం అన్నట్లుగా ఉంది ప్రస్తుత పాలన తీరు.

మరోవైపు, ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి ఊరకనే కూర్చోవడం లేదు. కల్వకుంట్ల తారక రామారావు, తన్నీరు హరీష్ రావు లాంటి నేతలు ప్రతిరోజూ కాంగ్రెస్ వైఫల్యాలను, ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, రైతు రుణమాఫీ లోపాలను తుత్తునియలు చేస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారు. విపక్షాల ఘాటు విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టాల్సిన కాంగ్రెస్ మంత్రులు, నేతలు.. సొంత ఇల్లాన్ని సర్దుకోలేక, క్షేత్రస్థాయి కార్యకర్తలను మెప్పించలేక ఆత్మరక్షణలో పడ్డారు. అంతకంటే ఘోరం ఏమిటంటే, సొంత పార్టీలోని కొందరు నేతలు ప్రతిపక్షాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ మంత్రులే బహిరంగంగా వ్యాఖ్యానించే స్థాయికి పరిస్థితులు దిగజారాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇచ్చిన హామీలు సక్రమంగా అమలు కాకపోవడంతో పాటు, స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ కార్యకర్తలను తొక్కిపెడుతుండటంతో విసిగిపోయిన శ్రేణులు విపక్షాల వైపు చూస్తున్నాయి.

?ఇదే నిస్సహాయ వాతావరణం, సమన్వయ లోపం రాబోయే రోజుల్లోనూ కొనసాగితే.. కాంగ్రెస్ పార్టీ రాబోయే ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి రావడం పగటి కలే అవుతుంది. అంతర్గత కలహాలతో కాంగ్రెస్ తన గోతిని తనే తవ్వుకుంటుంటే.. ప్రభుత్వ వ్యతిరేక ఓటును పూర్తిగా అనుకూలంగా మార్చుకుని మళ్లీ పీఠం ఎక్కేందుకు భారత రాష్ట్ర సమితి శతవిధాలా వ్యూహాలు రచిస్తోంది. అధికారంలో ఉన్న పార్టీలో గ్రూపు రాజకీయాలు ముదిరితే అది నేరుగా పరిపాలనపై ప్రభావం చూపుతుంది. నాయకుల మధ్య సఖ్యత లేకపోతే గ్రామ స్థాయిలో రాత్రింబవళ్లు పనిచేసే కార్యకర్తలు మానసికంగా కుంగిపోతారు. ఇది రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కాంగ్రెస్ గందరగోళాన్ని అనుకూలంగా మార్చుకుని, ప్రజల్లో పట్టు సాధించడానికి విపక్షాలు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోకుండా చూసుకుంటే, రాబోయే రోజుల్లో ప్రతిపక్షాలు మళ్లీ పుంజుకునే అవకాశాలను కొట్టిపారేయలేం.

కాంగ్రెస్ పార్టీకి అధికారం రావడం ఎంత కష్టమో, దాన్ని ఐదేళ్ల పాటు నిలబెట్టుకోవడం అంతకంటే కష్టం. ముఖ్యమంత్రి ఇప్పటికైనా కేవలం సచివాలయ ప్రాంగణాలకే పరిమితం కాకుండా, జిల్లాల్లో సొంత పార్టీని నాశనం చేస్తున్న మంత్రుల వైఖరిపై, రహస్య రాజకీయాల ఆటలపై ఉక్కుపాదం మోపాలి. సీనియర్లను గౌరవిస్తూ, నామినేటెడ్ పదవుల భర్తీలో స్థానిక కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వడం, విపక్షాల విమర్శలను తిప్పికొట్టేలా క్యాడర్‌ను సన్నద్ధం చేయడం తక్షణ అవసరం. మంత్రులు కేవలం రాజధానికే పరిమితం కాకుండా, జిల్లాల్లో పర్యటించినప్పుడు గుంపు రాజకీయాలకు తావులేకుండా కార్యకర్తలకు నమ్మకాన్ని ఇవ్వాలి. నమ్ముకున్న క్యాడర్‌కు భరోసా ఇవ్వకుండా, పక్క పార్టీల వాళ్లకు రెడ్ కార్పెట్ పరిస్తే.. ఈ అంతర్గత అసమ్మతి జ్వాలలు రేపు కాంగ్రెస్ అధికార కోటను బూడిద చేయడం ఖాయం! అధికారాన్ని సాధించడం కంటే, దాన్ని కాపాడుకోవడమే అసలైన రాజకీయం అని హస్తం నేతలు గ్రహించాల్సిన సమయం ఆసన్నమైంది.



**వెంక గారి భూమయ్య**
**సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ**
**9848559863**

## ఆష్టా గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ముధోల్, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండలంలోని ఆష్టా గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద 35 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్ల పనులు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. గ్రామాల రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా స్థానిక సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ పనులకు శంకుస్థాపన చేసి వేగవంతం చేశారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరిస్తూ, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నందుకు సర్పంచ్ ను గ్రామస్థులు అభినందించారు.



## అంగన్‌వాడీ ఉద్యోగాలను దివ్యాంగులకు కేటాయించాలి

ఆర్మూర్, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ప్రభుత్వం తాజాగా నోటిఫై చేసిన అంగన్‌వాడీ ఉద్యోగాలను దివ్యాంగులకు కేటాయించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశం డిమాండ్ చేశారు. బుధవారం ఆమె మాట్లాడుతూ, నియామకాల్లో వివాహమైన వారికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం సరైంది కాదన్నారు. చదువుకున్న దివ్యాంగులలో పెళ్లి కాని వారు చాలామంది ఉన్నారని, వారికి ఈ అవకాశం కల్పిస్తే ఆర్థిక భరోసా ఏర్పడి వివాహ జీవితంలో స్థిరపడటానికి తోడ్పడుతుందనానరు. పెళ్లితో సంబంధం లేకుండా దివ్యాంగులకు అవకాశం కల్పించాలన్నారు. వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం అన్ని ప్రభుత్వ శాఖలలో ఉన్న 5 శాతం కోటాను అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వంపై ధర్నాలకు వెనకాడబోమని స్పష్టం చేశారు.



## మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి ఊర పండుగ ఆహ్వానం

.వేల్పూర్, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, బాల్కొండ బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని బుధవారం వేల్పూర్ లోని ఆయన నివాసంలో భీంగల్ పట్టణ సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఊర పండుగ ఆత్మీయ ఆహ్వాన పత్రికను అందజేశారు. కమిటీ అధ్యక్షుడు పతాని కృష్ణ, ఉపాధ్యక్షుడు తీగల రఘు మాట్లాడుతూ, తొమ్మిది సంవత్సరాల విరామం తర్వాత జూలై 15న నిర్వహించనున్న ఊర పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని గ్రామదేవతల ఆశీస్సులు పొందాలన్నారు. ఈ వేడుకల్లో తప్పకుండా పాల్గొంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నిచ్చెమొల్ల రాజేశ్వర్, కోశాధికారి భూమేశ్వర్, కౌన్సిలర్లు నీలం రవి, మల్లెల ప్రసాద్, బొదిరె నర్సయ్య, గున్నాల బాలభాగత్ పాల్గొన్నారు.



## ఆర్మూర్ ఏడవ వార్డులో ఓటర్లకు ఎస్ఐఆర్ ఫారాల పంపిణీ

ఆర్మూర్, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని ఏడవ వార్డులో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)కార్యక్రమం బుధవారం వేగంగా సాగింది. వార్డు కౌన్సిలర్ కార్యాలయం వద్ద గల బుచ్చన్న కిరాణా షాప్ పక్కన బూత్ లెవెల్ అధికారి (బీఎల్ఓ) ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్లకు ఎలాంటి సందేహాలు ఉన్నా తహసీల్దార్ కార్యాలయ అధికారులు అన్ని విధాలుగా సహకరిస్తారన్నారు. వార్డులోని ఓటర్లందరూ బీఎల్ఓల నుండి ఎన్యుమరేషన్ ఫారాలను పొంది, వాటిని జాగ్రత్తగా పూర్తి చేసి తిరిగి బీఎల్ఓలకే సమర్పించాలని కోరారు. ఈ ఫారాలను నింపడానికి ఓటర్లు తమ ఆధార్ కార్డు, ఓటరు ఐడీ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోను సిద్ధంగా ఉంచుకుని అధికారులకు సహకరించి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## గుర్తింపు లేని పాఠశాలలను సీజ్ చేయాలి: పీడీఎస్‌యూ




నిర్మల్, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి ప్రభుత్వ గుర్తింపు లేకుండా ఇష్టారాజ్యంగా కొనసాగుతూ అక్రమ అడ్మిషన్లు జరుపుతున్న ప్రైవేట్ పాఠశాలలను తక్షణమే సీజ్ చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారికి (డీఈఓ) వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పవార్ కిరణ్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేకుండా కొనసాగుతూ విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుండి భారీగా ఫీజులను వసూలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా నిర్మల్ లోని ది ఢిల్లీ వరల్డ్ స్కూల్, జీ కిడ్స్ స్కూల్, భైంసాలోని వేదం ఒలింపియాడ్ పాఠశాలలను వెంటనే సీజ్ చేసి యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. అలాగే విద్యను పూర్తిగా వ్యాపారంగా మారుస్తున్న నారాయణ, శ్రీచైతన్య, విన్నర్, ఎస్ఆర్, వాసవి, వింగ్స్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్, నాయకులు నవీన్, సిద్ధార్థ్ పాల్గొన్నారు.

## కుంటాల బీసీ హాస్టల్‌లో అదనపు సీట్లు మంజూరు చేయాలి

నిర్మల్, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో సీట్ల కొరత కారణంగా పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే అదనపు సీట్లను మంజూరు చేయాలని సీవైఎస్ఎస్, యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు బుధవారం జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఏఎస్డబ్ల్యూఓ సత్యనారాయణ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సీవైఎస్ఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాత్కార్ నవీన్ మాట్లాడుతూ, హాస్టల్‌లో ఉన్న సీట్లు పూర్తిగా నిండిపోవడంతో ప్రభుత్వ మోడల్ స్కూల్‌తో పాటు ఇతర విద్యాసంస్థల్లో చదువుతున్న అనేక మంది బీసీ విద్యార్థులకు ప్రవేశాలు లభించడం లేదన్నారు. గ్రామీణ ప్రాంత నిరుపేద విద్యార్థులకు ప్రైవేట్ హాస్టళ్లలో ఉండే ఆర్థిక స్థోమత లేక చదువుకు దూరమయ్యే పరిస్థితి వస్తోందని, వెంటనే అదనపు సీట్లు మంజూరు చేయాలని కోరారు.



## జిరాయత్‌నగర్ శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆర్మూర్, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఆర్మూర్ పట్టణంలోని జిరాయత్‌నగర్ పహాడీగూడ శ్మశానవాటిక అభివృద్ధి కోసం మాజీ రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్ రెడ్డి తన ఎంపీ నిధుల నుండి మంజూరు చేసిన 5 లక్షల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు షాహిద్ అలీ మాట్లాడుతూ, కేఆర్ సురేష్ రెడ్డి నిజామాబాద్ జిల్లా అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. పార్లమెంటులో పసుపు బోర్డు ఏర్పాటు, మైనారిటీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల సమస్య, వక్ఫ్ బోర్డు బిల్లు వంటి అంశాలపై ఆయన బలంగా గళం వినిపించారన్నారు. శ్మశానవాటిక అభివృద్ధికి ఈ నిధులు ఎంతో తోహదపడతాయన్నారు. కార్యక్రమంలో గ్రేవ్ యార్డ్ అధ్యక్షుడు మీర్ మజీద్, మర్కజ్ అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్, ఉస్మాన్, సాజిద్, సాదిక్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.




# ఆరోగ్య రక్షకు అడ్డుగోడగా అధికారుల అలసత్వం!

## నిర్మల్ జిల్లాలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ నత్తనడక
## రెండు నెలల్లో సగం కూడా దాటని వంద శాతం లక్ష్యం
## వేలాది మంది బాలికల భవిష్యత్తుపై ఎదురుచూపులు

నిర్మల్ (తెలంగాణ వెన్నెల వాక్కు): భవిష్యత్తులో మహిళలను గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధి బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో ప్రారంభించిన హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (చ్‌పీవీ) వ్యాక్సినేషన్ కార్యక్రమం జిల్లాలో అధికారుల నిర్లక్ష్యానికి బలవుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల ఆరోగ్య రక్షణ కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ ఉచితంగా ఈ టీకాలను అందుబాటులోకి తీసుకొచ్చినా, క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ అధికారుల అలసత్వం కారణంగా ఈ బృహత్తర కార్యక్రమం ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదు. టీకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, తల్లిదండ్రులను ఒప్పించడం, గ్రామాల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం వంటి చర్యల్లో అధికారుల వైఫల్యం క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తోంది.

లక్ష్యం రెండు వేలు.. దాటని వందలు!

జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక ముందస్తు సర్వేలో 14 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన సుమారు 2,100 మంది బాలికలను హెచ్‌పీవీ వ్యాక్సిన్‌కు అర్హులుగా గుర్తించారు. రెండు నెలల క్రితమే ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకు కేవలం 897 మంది బాలికలకు మాత్రమే టీకా అందించగలిగారు. అంటే వంద శాతం పూర్తి కావాల్సిన ఈ ప్రక్రియలో సగానికి కూడా చేరుకోని దయనీయ స్థితిలో కార్యక్రమం నిలిచిపోయింది. ఇంకా 1,203 మంది బాలికలు టీకా కోసం ఎదురుచూస్తుండటం గమనార్హం. జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, వందలాది మంది వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్నప్పటికీ లక్ష్య సాధనలో ఇంతటి తీవ్ర వెనుకబాటు కనిపించడం ఆందోళన కలిగిస్తోంది.




కేంద్రాల్లో కనిపించని పురోగతి

జిల్లాలోని నిర్మల్, సోన్, దిలావర్‌పూర్, సారంగాపూర్, మామడ, లక్ష్మణ్‌చందా, ఖానాపూర్, కడెం, పెంబి, కుభీర్, భైంసా, తానూర్, బాసర, ముధోల్, లోకేశ్వరం తదితర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగుతున్నప్పటికీ ఏ ఒక్క కేంద్రంలోనూ ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదు. కొన్ని ప్రాంతాల్లో తల్లిదండ్రులకు సరైన సమాచారం లేకపోవడం, మరికొన్ని చోట్ల ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించకపోవడం, ఇంకొన్ని గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించకపోవడం వల్ల టీకాల ప్రక్రియ మందగించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది పూర్తి సమన్వయంతో క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఆ దిశగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించిందని స్థానికులు పేర్కొంటున్నారు.

సమయం దాటితే ప్రయోజనం శూన్యం!

హెచ్ పీవీ వ్యాక్సిన్‌ను 9 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సులో వేయడం అత్యంత ప్రభావవంతమని వైద్య నిపుణులు స్పష్టంగా చెబుతున్నారు. ఈ వయస్సులో పిల్లల్లో రోగనిరోధక శక్తి అధికంగా ఉండటంతో భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వచ్చే ప్రమాదం గణనీయంగా తగ్గుతుంది. 14 సంవత్సరాల వయస్సు దాటిన తర్వాత ఈ టీకా ప్రయోజనం చాలా వరకు తగ్గే అవకాశాలు ఉండటంతో అర్హులైన ప్రతి బాలికకు సమయానికి టీకా అందించడం అత్యంత కీలకం. అయినప్పటికీ జిల్లాలో కాలయాపన కొనసాగుతుండటంతో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హెచ్‌పీవీ వైరస్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు ప్రతి సంవత్సరం క్యాన్సర్ బారిన పడుతున్నారని వైద్య గణాంకాలు చెబుతున్నాయి. ఈ వ్యాధిని ముందుగానే నివారించగలిగే ఏకైక సమర్థవంతమైన ఆయుధం ఈ వ్యాక్సిన్ మాత్రమేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా సూచించింది. అలాంటి కీలకమైన కార్యక్రమం నిర్మల్ జిల్లాలో నత్తనడకన సాగడం అధికారుల పనితీరుపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ప్రతి పాఠశాల, గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించి, ప్రతి అర్హత గల బాలికకు ఆలస్యం లేకుండా హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందేలా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## భవిష్య దర్శిని పాఠశాలలో విద్యాశాఖ అధికారుల విచారణ

ఆర్మూర్, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్ లో గల భవిష్య దర్శిని పాఠశాలలో తలెత్తిన వివాదాస్పద అంశాలపై విద్యాశాఖ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. పాఠశాలలో ఉర్దూ బోధన జరుగుతోందన్న ఆరోపణల నేపథ్యంలో బుధవారం అధికారులు పాఠశాలను సందర్శించారు. ఈ విచారణ విషయమై ఆర్మూర్ మండల విద్యాధికారి రాజ గంగారాం మాట్లాడుతూ, పాఠశాలలో ఉర్దూ బోధన అంశంపై విద్యార్థులను, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందిని, విద్యార్థుల తల్లిదండ్రులను, యాజమాన్యాన్ని క్షుణ్ణంగా విచారించడం జరుగుతోందన్నారు. అందరి వాంగ్మూలాలను సేకరించిన పిదప, సమగ్ర నివేదికను ఉన్నత స్థాయి జిల్లా అధికారులకు తదుపరి చర్యల కొరకు అందజేస్తామని వెల్లడించారు.



## ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లో కలెక్టర్ భవేశ్ మిశ్రా భోజనం

.నిర్మల్, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లో మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహారం రుచికరంగా, నాణ్యతతో ఉందని నిర్వాహకులను, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ప్రజలు, ఉద్యోగులకు ప్రతిరోజూ పరిశుభ్రమైన వాతావరణంలో, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. భోజనం అనంతరం కలెక్టర్ యూపీఐ ద్వారా భోజనానికి సంబంధించిన చెల్లింపును స్వయంగా చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఆర్డీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.




## రైతులు ఆయిల్ పామ్ పంటల సాగుపై దృష్టి పెట్టాలి: కలెక్టర్

మామడ, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు): జిల్లాలోని రైతులందరూ అధిక లాభాలను ఇచ్చే ఆయిల్ పామ్ వాణిజ్య పంటల సాగు వైపు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు. బుధవారం మామడ మండలం పరిమండల్ గ్రామంలో నిర్వహించిన ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. గ్రామానికి చెందిన స్థానిక రైతులు గబ్బర్ సింగ్ చౌహాన్, బిక్కు నాయక్ చౌహాన్ లకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో జిల్లా అధికారులు, రైతులతో కలిసి ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం మార్కెట్లో ఆయిల్ పామ్ పంటకు మంచి డిమాండ్ ఉందని, పండించిన పంటకు ప్రభుత్వమే మార్కెటింగ్ కల్పిస్తుందన్నారు. ఇతర పంటలతో పోల్చుకుంటే దీనికి నీటి అవసరం చాలా తక్కువని, అంతర పంటలుగా ఇతర పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి నానో యూరియా వైపు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి రమణ, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ పాల్గొన్నారు.



## సామాజిక ఆసుపత్రిలో ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు

ముధోల్, జులై 1(తెలంగాణ వెన్నెల వాక్కు ):మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో జాతీయ డాక్టర్స్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సేవలందిస్తున్న వైద్యులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ వైద్యులు ప్రజల ప్రాణాలను కాపాడే దేవుళ్లతో సమానమని పేర్కొన్నారు. రోగులకు ఎలాంటి పరిస్థితుల్లోనైనా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ సమాజానికి విశేష సేవలు చేస్తున్న ప్రతి వైద్యులకు డాక్టర్స్ డే సందర్భంగా అభినందనలు తెలిపారు. వైద్యులు కూడా తమ వృత్తి పట్ల నిబద్ధతతో మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి డాక్టర్స్ డే వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సాయి సువర్ధన్, మల్లికార్జున్, టీవీ సూపర్వైజర్ లాలయ్య,నర్సింగ్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## దుబాయ్‌లో సారంగాపూర్ కార్మికుడు నర్సింలు మృతి

సారంగాపూర్, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన ఒడ్డే నర్సింలు బ్రతుకుతెరువు కోసం గల్ఫ్ దేశమైన దుబాయ్‌కి వలస వెళ్లి, అక్కడ గత మూడు రోజుల క్రితం తీవ్ర అనారోగ్య కారణాలతో హఠాత్తుగా మృతి చెందాడు. పేద కుటుంబానికి చెందిన నర్సింలు మృతితో దిక్కుతోచని స్థితిలో ఉన్న కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని స్థానిక శాసనసభ్యుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ, విదేశాంగ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో, ఎన్ఆర్ఐ సెల్ బాధ్యులతో ఫోన్ లో మాట్లాడారు. నర్సింలు భౌతికకాయాన్ని దుబాయ్ నుండి సాధ్యమైనంత త్వరగా స్వదేశానికి రప్పించి కుటుంబ సభ్యులకు అప్పగించేలా అవసరమైన అన్ని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను లను కోరారు.



## బన్సపల్లి గ్రామ పంచాయతీలో రికార్డుల తనిఖీ

దిలావర్‌పూర్, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు): దిలావర్‌పూర్ మండల పరిధిలోని బాన్సపల్లి గ్రామ పంచాయతీని బుధవారం మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) గోవర్ధన్ ఆకస్మికంగా సందర్శించారు. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీకి సంబంధించిన పలు ముఖ్యమైన అధికారిక రికార్డులను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేసి, రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం గ్రామంలో సాగుతున్న హరితహారం నర్సరీని, తడి–పొడి చెత్త వేరుచేసే సంపద సృష్టి కేంద్రాన్ని, నూతనంగా నిర్మిస్తున్న వైకుంఠ ధామం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పంచాయతీ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ నిధులు, వ్యయాలకు సంబంధించిన సామాజిక తనిఖీ వెరిఫికేషన్ ప్రక్రియను ఆయన స్వయంగా పర్యవేక్షించి, పనుల్లో పారదర్శకత పాటించాలని పంచాయతీ కార్యదర్శి, సిబ్బందికి స్పష్టం చేశారు.




## మణికంఠ సేవా సమితి ఆర్మూర్ ఆధ్వర్యంలో మణికంఠుడికి ప్రత్యేక పూజలు.

ఆర్మూర్,జులై01:(తెలంగాణ వెన్నెల వాక్కు) నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణ శ్రీ నవనాథ సిద్ధుల గుట్ట అయ్యప్ప దేవాలయం లో ప్రతినెల 1వ బుధవారం పురస్కరించుకొని నగేష్ శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో ఉదయం శ్రీ గణపతి.శ్రీసుబ్రహ్మణ్యం శ్రీ అయ్యప్ప స్వామి వాళ్ళకు ప్రత్యేక పూజలు హారతి మంత్రపుష్పం,మధ్యాహ్నం 01.00 నిముషాలకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరిగినది.ఇట్టి కార్యక్రమము ప్రారంభించిన వి.అయ్యప్ప శ్రీనివాస్ అయ్యప్ప ఆలయం నిర్మాణ కర్త ని,అన్ని విధాల సహాయ సహకారం అందిస్తున్నందుకు శాలువతొ సత్కరించనైనదైని మణికంఠ సేవా సమితి అధ్యక్షులు చేపూరు దనంజయ్ తెలిపినారు.ఈ సందర్భంగా మణికంఠ సేవా సమితి అధ్యక్షులు నవనాథ సిద్ధుల గుట్ట కమిటీ దాతలకు,పాల్గొన్న అయ్యప్ప స్వామి భక్తులకు,ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినారు.ఈ కార్యక్రమంలో మణికంఠ సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఉదయ్ ఉపాధ్యక్షులు కౌటికేవిజయ్,కోశాధికారి సురేష్ చారి,ప్రచార కార్యదర్శి గంగా మోహన్,సలహదారులు శ్రీహరి,గురు స్వామి లింగా రెడ్డి,గోవింద్ పేట్ గురు స్వామి.వాడి అశోక్ గురు స్వామి.మహేందర్ స్వామి.యాదగిరి కిషన్ గురు స్వామి.పుల ప్రసాద గురు స్వామి.నందు గురు స్వామి.సిట్ అశోక్ గురు స్వామి.ప్రవీణ్ గురు స్వామి.రమణయ్య గురు స్వామి.మెడికల్ రాజేష్ స్వామి,అయ్యప్ప భక్తులు



## మాతా, శిశు ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు పెంచాలి: కలెక్టర్

నిర్మల్, జూలై 1 (తెలంగాణ వెన్నెల వాక్కు): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాతా, శిశు సంరక్షణ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్యను మరింత పెంచాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ మాతా, శిశు ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను స్వయంగా పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ 24 గంటలూ వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, అవసరమైన వైద్య పరీక్షలు, మందులను ఉచితంగా అందించాలన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారితో స్వయంగా మాట్లాడి, వైద్యం సరిగ్గా అందుతుందా, వసతులు ఎలా ఉన్నాయనే వివరాలను ఆరా తీశారు. ఆసుపత్రి ప్రాంగణంలో సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలన్నారు. ఈ తనిఖీలో ఆస్పత్రి పర్యవేక్షకురాలు సరోజ, అధికారులు గోపాల్ సింగ్, రమేష్ పాల్గొన్నారు.




## గ్రామస్తుల ముందే దూషణలు

### మనస్తాపంతో అక్లాపూర్ పంచాయతీ కార్మికుడి ఆత్మహత్యాయత్నం.. ఆసుపత్రిలో పరిస్థితి విషమం!

నిర్మల్ జూలై 1 తెలంగాణ వెన్నెల వాక్కు నిర్మల్ రూరల్ మండల పరిధిలోని అక్కాపూర్ గ్రామంలో గురువారం ఒక విషాదకర సంఘటన చోటుచేసుకుంది. విధి నిర్వహణలో ఉన్న ఒక నిరుపేద పంచాయతీ కార్మికుడిని (సఫాయి వర్కర్) కొందరు వ్యక్తులు అందరి ముందే తీవ్రంగా దూషించి, అవమానించడంతో ఆ అవమానాన్ని తట్టుకోలేక సదరు కార్మికుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామ పారిశుధ్యం కోసం నిత్యం శ్రమిస్తున్న కార్మికుడిపై ఈ రకమైన దౌర్జన్యం జరగడం స్థానికంగా తీవ్ర కలకలాన్ని రేపింది.తోటి కార్మికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సదరు పంచాయతీ వర్కర్ ఎప్పటిలాగే గ్రామంలో తన విధులను నిర్వహిస్తుండగా, కొందరు వ్యక్తులు చిన్న కారణానికే పెద్ద గొడవ చేసి, నలుగురి ముందే అతడిని హీనంగా మాట్లాడారు. నిత్యం కష్టపడి పనిచేసే తనను అందరి ముందు అలా అవమానించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆ కార్మికుడు, ఇంటికి వెళ్లి పురుగుల మందు తాగాడు.

కార్మికుడు అపస్మారక స్థితిలోకి వెళ్లడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు, తోటి గ్రామస్తులు వెంటనే స్పందించి 108 వాహనం ద్వారా నిర్మల్ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో అతనికి అత్యవసర విభాగంలో వైద్యులు చికిత్స అందిస్తున్నారని, పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని సమాచారం.ఈ ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఆసుపత్రికి చేరుకుని బాధితుడి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ తాత్కాలిక సిబ్బందిపై ఇలాంటి అమానవీయ ప్రవర్తనకు పాల్పడి, ఆత్మహత్యకు ప్రేరేపించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తోటి పంచాయతీ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుపుతున్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com